క్లుప్తంగా

కనుల పండువగా ధ్వజ స్తంభ ప్రతిష్ట


కలగళ్లలో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టించిన దృశ్యం

కూడేరు: మండలంలోని కలగళ్లలో అయప్ప స్వామి ఆలయం ముందు ధ్వజ స్తంభ ప్రతిష్టాపన గురువారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఘనంగా సాగింది. తొలుత వేద పండితులు హోమాలు నిర్వహించారు. గ్రామస్తులు ప్రతిష్ట కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని, కనుల పండువగా జరుపుకున్నారు. అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


ఉదిరిపికొండలో షెడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జేడీ వెంకటస్వామి

కూడేరు: గోకులం షెడ్ల నిర్మాణాలను తొందరగా పూర్తి చేయించాలని జిల్లా పశు సంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి సూచించారు. గురువారం మండలంలోని ఉదిరిపికొండ, ఉదిరిపికొండ తండా గ్రామాల్లో జేడీ పర్యటించారు. గోకులం షెడ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండలంలో ఎన్ని షెడ్లు మంజూరయ్యాయని మండల అధికారులతో ఆరా తీశారు. షెడ్లను నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మించుకొని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారుకు ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, పశు వైద్యాధికారులు శ్రీనివాసులు, శ్వేత, ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజనీర్ రవి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడి ఇల్లు కబ్జా అన్యాయం

రాయదుర్గంటౌన్: దివ్యాంగుడి ఇల్లు కబ్జా చేయడం చాలా అన్యాయమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. గురువారం కణేకల్లు మండలం బిదురుకొంతం గ్రామానికి చెందిన దివ్యాంగుడు విజయ్‌కుమార్ ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఇల్లు నిర్మించుకున్నాడని, అయితే అదే గ్రామానికి చెందిన కోటేశ్వరప్ప దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడన్నారు. ఇతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడితో కలిసి రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణను కోరారు. దివ్యాంగుల సంఘం నాయకులు వసంతకుమార్, రాజన్న, వన్నారెడ్డి, శివకుమార్, హనుమంతు, ఎంఆర్‌పీఎస్ నాయకులు వన్నూరప్ప, రామకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

దివ్యాంగులను చైతన్యపరుస్తాం

కూడేరు: ప్రభుత్వాలు దివ్యాంగులకు కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించి చైతన్యపరిచేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న తెలిపారు. గురువారం ఆయన కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26న దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రంగా వ్యాప్తంగా ఘనంగా జరుపుకోవాలని పిలుపు నిచ్చారు.

23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు

రాయదుర్గంటౌన్: జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈ నెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ నాగరాజు, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సుజాత తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

కనుల పండువగా పల్లకీ ఉత్సవం


అలంకరణలో షిర్డీసాయినాథుడు

వజ్రకరూరు: స్థానిక షిర్డీసాయి ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు, తీర్థప్రసాద వినియోగం, అర్చనలు,మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, హారతులు తదితర కార్య క్ర మాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పల్లకీ ఉత్సవం నిర్వహించారు. రాత్రి శేజ్‌హారతి భక్తి శ్రద్ధలతో చేశారు.




నిండుకుండలా బీటీప్రాజెక్ట్ , గుమ్మఘట్ట మండలానికి సాగునీరు అందించే ప్రధాన ఎడవ కాలువ దుస్థితి , బ్రహ్మసముద్రం మండలానికి సాగునీరు అందించే కుడి కాలువ ఇలా..

కాలువలు ఇలా .. నీరు పారేదెలా?

- అధ్వానంగా బీటీపీ ప్రధాన సాగునీటి కాలువలు
- పేరుకుపోయిన పూడిక, పెరిగిన ముళ్లకంపలు
- చివరి ఆయకట్టు రైతులకు తప్పని కష్టాలు
- డిసెంబర్ మొదటి వారంలో నీటి విడుదలకు సన్నాహాలు

రాయదుర్గం/గుమ్మఘట్ట/బ్రహ్మసముద్రం: మరో పది, పదిహేను రోజుల్లో బీటీప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు పొలాలకు సాగునీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేశారు. డిసెంబర్ 5 తర్వాత రైతులతో సమావేశం నిర్వహించి, నీటి కేటాయింపులు ఖరారు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అయితే గడువు సమీపిస్తున్నా ప్రధాన కుడి, ఎడమ కాలువలు, ఉప కాలువలు దెబ్బతిని మరమ్మతుల కోసం ఎదురుచూస్తున్నాయి. కాలువలు ఇలా ఉంటే నీరు పారేదెలా? అని చివరి ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం మండలాల రైతులకు సాగునీటి వరప్రదాయినిగా చెప్పుకునే బీటీప్రాజెక్ట్ ఈ ఏడాది నిండుకుండను తలపిస్తోంది. కర్ణాటక రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు వేదావతి పరవళ్లు తొక్కింది. దిగువనున్న బీటీ ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 1,55 అడుగులు కాగా, ప్రస్తుతం 1654.6 అడుగులకు నీటి నిల్వ చేరింది. రొటేషన్ పద్ధతిలో భాగంగా ఈ నీటిని గుమ్మఘట్ట మండలంలోని ఎడమకాలువ పరిధిలో 15 నుంచి 17వ డిస్ట్రిబూటర్ వరకు 3 వేలు, బ్రహ్మసముద్రం మండలం కుడి కాలువ పరిధిలోని 1 నుంచి 6ఏ డిస్ట్రిబూటర్ వరకు 2 వేల ఎకరాలు మొత్తం ఐదు వేల ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరందిచేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

ధ్వంసమైన డ్రాప్టు‌లు..

కుడి కాలువలో 14, ఎడమ కాలువలో 19 డిస్ట్రిబూటర్లు ఉన్నాయి. వీటి పరిధిలోని క్రాస్‌రెగ్యులేటర్లు, డ్రాప్టులు, షట్టర్లు, సిమెంట్లు బెడ్డింగ్‌లు పలు చోట్ల ధ్వంసమయ్యాయి. వీటి మరమ్మతుపై నిర్లక్ష్యం వహిస్తే తూముల వద్ద లీకేజీలు ఏర్పడే అవకాశం ఉంది. తరచూ రైతుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. వీటిని బందోబస్తు చేస్తే తప్పా చివరి ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందడం సాధ్యం కాదు. అధికారులు వీటి నిర్వహణపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతుల కోసం రూ.85 లక్షలు

గుమ్మఘట్ట మండలంలోని ఎడమ కాలువ పరిధిలో 10 నుంచి 25 కిలోమీటర్ల వరకు ప్రధాన కాలువ మరమ్మతుల కోసం రూ.25 లక్షలు, బ్రహ్మసముద్రం మండలంలోని కుడి కాలువ పరిధిలో 1 నుంచి 14 కిలోమీటర్ల వరకు రూ.23 లక్షలు, ప్రాజెక్ట్ వద్ద విద్యుదీకరణ, గేట్లు, హెడ్ స్లూయిస్, ఎడమ కాలువ పరిధిలోని 1 నుంచి 10 కిలోమీటర్ల వరకు రూ.36 లక్షలు మొత్తం రూ.85 లక్షలతో మరమ్మతులు చేపట్టేందు కోసం నిధులు మంజూరైనట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ నిధులకు టెండర్ ప్రక్రియ పూర్తి కానుంది. అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా 22న జరగాల్సిన సాగునీటి ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. తర్వాత తేదీని ప్రకటించనున్నారు. ఆ ఎన్నికలు పూర్తయితేగానీ పనులు చేపట్టే అవకాశం లేదని తెలుస్తోంది.

ఉపాధిలో ఉప కాలువలు చేయించాలి

ప్రధాన కాలువల మరమ్మతులు పూర్తయ్యేలోపు ఉప కాలువ మరమ్మతులపై అధికారులు, పాలకులు దృష్టి సారించాల్సి ఉంది. గతేడాది వర్షభావ పరిస్థితులతో నీరు విడుదల చేయలేదు. కాలువలన్నీ పూడికతో నిండాయి. ఉపాధి పథకం ద్వారా వీటిని శుభ్రం చేయిస్తే రైతుకు ప్రయోజనం చేకూరుతుంది. ఈ దిశగా చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కాలువల మరమ్మతులు చేపట్టాలి



ప్రధాన కాలువ మరమ్మతులు పూర్తి చేశాకే సాగునీటి విడుదలకు శ్రీకారం చుట్టాలి. భూపసముద్రం 16, 17వ డిస్ట్రిబూటర్ల పరిధిలోకి వస్తుంది. సుమారు 25 కిలోమీటర్ల నుంచి ఆయకట్టులోకి సాగునీరు అందాల్సి ఉంది. కాలువ శుభ్రంగా ఉండాలి. అధికారులు ముందు ఈ ప్రక్రియ పూర్తిచేశాకే నీటి విడుదలపై దృష్టి సారించాలి.

– గందవిడి తిప్పేస్వామి, రైతు, భూపసముద్రం, గుమ్మఘట్ట మండలం

నాణ్యతగా చేపట్టాలి



నీరు విడుదలకు కేవలం రెండు రోజులు ముందు కాకుండా నేటి నుంచే కాలువ పనులు చేపట్టాలి. అప్పుడే చివరి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందడం సాధ్యమవుతుంది. కంటితుడుపుగా కాకుండా పనులన్నీ నాణ్యతగా జరిగేలా కృషి చేయాలి. పిల్ల కాలువలన్నీ ఉపాధి నిధులతో చేపట్టి రైతుకు ఉపశమనం కల్పించాలి.

– ఇస్మాయిల్, రైతు, బుడిమేపల్లి, బ్రహ్మసముద్రం మండలం

త్వరలోనే ప్రారంభిస్తాం



ప్రధాన కాలవల మరమ్మతులను త్వరలోనే పూర్తి చేయిస్తాం. కాలవల మరమ్మతులు, ప్రాజెక్ట్ వద్ద అభివృద్ధి పనుల కోసం రూ.85 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఒకటి రెండు రోజుల్లోనే టెండర్ ప్రక్రియ పూర్తవుతుంది. చివరి ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందేలా కృషి చేస్తాం. డిసెంబర్ మొదటి వారంలో ఆయకట్టు దారులతో సమావేశం నిర్వహించి, నీటి కేటాయింపులు ప్రకటిస్తాం.

– బలరాముడు, మైనర్ ఇరిగేషన్ డీఈ, రాయదుర్గం

సచివాలయ సిబ్బందిని నియమించండి

కళ్యాణదుర్గం: శెట్టూరు మండల కేంద్రంలోని సచివాలయంలో రెండు నెలలుగా సచివాలయ సిబ్బంది లేక ప్రజలు అవస్థలు పడుతున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు విన్నవించారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, జిల్లా సలహాదారులు చాంద్‌బాషా, శెట్టూరు మండల అధ్యక్షులు వెట్టి తిప్పేస్వామి, మండల ఉపాధ్యక్షులు బసంపల్లి మహేష్ ఆర్డీఓ వసంత బాబును కలిశారు. ఈ సందర్భంగా శెట్టూరు మండల కేంద్రంలో రెండు నెలలుగా డిజిటల్ అసిస్టెంట్ , వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సర్వేయర్, వీఆర్వో లేక ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు.

మహిళలపై వేధింపులు అరికట్టాలి


మాట్లాడుతున్న మోహన్‌నాయక్

రాయదుర్గంటౌన్: మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు అరికట్టాలని హరిత దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల నుంచి రాష్ట్రంలోని ఏదో ఒక ప్రాంతంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, లైంగిక దాడులు, హత్యలు పెచ్చుమీరుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

కుందుర్పిలో కనకదాసు జయంతి

కుందుర్పి: మండల కేంద్రంలో కనకదాసు జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఉదయం కనకదాసు విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. మధ్యాహ్నం కనకదాసు చిత్రపటాన్ని ట్రాక్టరులో ఉంచి గ్రామోత్సవం చేశారు. వందలాది మంది మహిళలు బోనాలతో వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కురుబ సంఘం నాయకులు మర్చంట్ గోపాల్, సోమశేఖర్, వై.రమేష్, గోసి గోపాల్, జగదీష్, శంకర్, మధు, మరిస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు ఉపసంహరించుకోవాలి

రాయదుర్గంటౌన్: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం తగ్గించుకోకపోతే వామపక్ష పార్టీలతో కలిసి ఉద్యమాలు చేస్తామని సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున అన్నారు. ఈ మేరకు సీపీఐ నాయకులు ఆ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచమని హామీ ఇచ్చి మోసం చేసినట్లు విమర్శించారు. ఇప్పటికే అన్ని రకాల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ చార్జీల భారంతో మరింత కుదేలవుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం కృష్ణానాయక్

వజ్రకరూరు: స్థానిక కేవీ జేడీప్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.వంశీకృష్ణ అనే విద్యార్థి అండర్–19 జూడో విభాగంలో అనంతపురం జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సి.కృష్ణానాయక్ తెలిపారు. గురువారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థిని హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 23,24 తేదీల్లో చిత్తూరు జిల్లా రేణిగుంటలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థి పాల్గొంటాడని తెలిపారు.

ఘనంగా సర్మాస్ హుస్సేనీ ఉరుసు


అలంకరణలో సర్మాస్ హుస్సేనీ స్వామి


చక్కెర చదివింపులు చేసుకుంటున్న భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న దర్గా

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మాస్ హుస్సేనీ స్వాముల ఉరుసు ఘనంగా నిర్వహించారు. గురువారం అనేక ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి చాదర్, పూలమాలలు, చక్కెర సమర్పించారు. పిల్లలకు దర్గా ఆవరణలో చక్కెర తూకాలతో మొక్కులు చెల్లించుకున్నారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో బొమ్మనహాళ్,కణేకల్లు ఎస్‌ఐలు నబీ రసూల్, నాగమధు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. నేడు ఆదివారం ఉదయం తెల్లవారుజామున సర్మాస్ హుస్సేనీ షంషేర్ నిర్వహించబతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

హెచ్చెల్సీ పనుల పరిశీలన


హెచ్చెల్సీ పనులను పరిశీలించిన అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కణేకల్లు/బొమ్మనహాళ్: ఇటీవల జరిగిన హెచ్చెల్సీ పనులను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న గురువారం పరిశీలించారు. హెచ్చెల్సీకి నీటి విడుదల సమయంలో అధికారులు గుర్తించిన ఐదు పనులను రూ.1.25 కోట్లతో మరమ్మతులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కలెక్టర్ పనులను పరిశీలించారు. మోపిడితోపాటు బొమ్మనహాళ్ మండలంలో 119 కిమీ వద్ద రూ.60 లక్షలు, 112 కిమీతో రూ.13 లక్షలతో జరిగిన పనులను ఆమె పరిశీలించారు. పనులతోపాటు కణేకల్లు చెరువు అవుట్‌ఫ్లో రెగ్యులేటర్‌ను పరిశీలించారు. కణేకల్లు హెచ్చెల్సీ సబ్ డివిజన్ డీఈఈ మద్దిలేటి, ఏఈఈ నరేంద్ర మారుతి, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

- రికార్డుల్లో పేర్లు సవరణలతో విద్యార్థులు, తల్లిదండ్రులకు అవస్థలు
- ప్రత్యామ్నాయ ఆధార్ కేంద్రాల్లో పని చేయని సర్వర్లు

కష్టాలు అపార్ం



ఈచిత్రంలో కనిపిస్తున్న దివ్యాంగుడి పేరు మణికంఠ. స్థానికంగా 9వ తరగతి చదువుతున్నాడు. తన ఆధార్ కార్డులో ఇంటిపేరు తప్పు గా పడడంతో సరిచేసుకునేందుకు మూడు రోజులుగా ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నాడు. తల్లి సహాయంతో ఉదయం నుంచి పడిగాపులుకాసినా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ఈచిత్రంలో కనిపిస్తున్న వీరు ఇంటర్ మీడియట్ విద్యార్థినులు. అపార్ కోసం, తహసీల్దార్ సంతకం కోసం రెండురోజులుగా తిరుగుతున్నారు. ఉరవకొండ తహసీల్దార్.. కూడేరుకు కూడా ఇన్‌చార్జ్ కావడంతో విద్యార్థినులకు అధికారులు అందుబాటులో ఉండడంలేదు. దీంతో కళాశాలకు వెళ్లకుండా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని చెప్తున్నారు.



ఈమె పేరు సావిత్రి. ఉరవకొండ మండలం రేణుమాకుపల్లి గ్రామానికి చెందిన ఈమె తన కొడుకు యశ్వంత్ (8వతరగతి) తీసుకొని ఉరవకొండలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి మూడు రోజులుగా తిరుగుతోంది. ఆధార్‌కార్డులో పుట్టిన తేదీ తప్పుగా ఉండడంతో ఆధార్ కేంద్రం చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని, పట్టించుకునేవారు లేరని వాపోయింది.

ఉరవకొండ: ప్రతి విద్యార్థికీ అపార్ (ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు జారీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు ..ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు కష్టాలు తెచ్చిపెట్టాయి. అపార్‌లో వివరాల నమోదులో యు డైస్ ప్లస్ పాఠశాలలోని అడ్మిషన్ రికార్డు, ఆధార్ కార్డులోని వివరాలను ప్రాతిపదికన తీసుకుంటున్నారు. ఈమూడింటిలో ఏ ఒక్కదానిలో ఒక్క అక్షరం తప్పు ఉన్నా.. అపార్ జనరేట్ కావడం లేదు. ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకగా ఉండటం, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేయడానికి సమస్యలు వస్తున్నాయి. మరోవైపు ఆధార్‌ను సరిచేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. ఈనెలాఖరు నాటికి 100 శాతం మేర అపార్ కార్డులు జనరేట్ చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

ఆధార్ శిబిరాలు వద్ద విద్యార్థుల తల్లిదండ్రుల పడిగాపులు:

ఆధార్ కార్డులో పేర్లు, ఇతర వివరాల సవరణ కోసం విద్యార్థుల సౌకర్యార్థం ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో 24 ఆధార్ కేంద్రాలను ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. ఇందులో 24 కేంద్రాల్లో కేవలం 10 కేంద్రాల్లో మాత్రమే సర్వర్ పనిచేస్తుండటంతో మిగితా కేంద్రాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు. సోమవారం నుంచి శనివారం వరకు మాత్రమే ఈకేంద్రాలు పని చేస్తాయని అధికారులు చెప్తున్నా ఆధార్ కేంద్రాల్లో మాత్రం సర్వర్ ఇతర సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. మూడు నియోజకవర్గాల పరిధిలో రాయదుర్గం (అర్బన్) రాయదుర్గం (రూరల్), కణేకల్లు, గుమ్మగట్ట–1,2, బొమ్మనహాళ్, బెళుగుప్ప–1,2, ఉరవకొండ అర్బన్–1,2, ఉరవకొండ రూరల్–2, వజ్రకరూరు, విడపనకల్లు, కూడేరు, కళ్యాణదుర్గం అర్బన్–1,2,3, కళ్యాణదుర్గం రూరల్, బొమ్మనహాళ్, బ్రహ్మసముద్రం, కుందుర్పి–2, శెట్టూరు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.


ఉరవకొండ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో వేచి ఉన్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు

లక్ష్య సాధనకు ఆమడ దూరం:

ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 1 నుంచి ఇంటర్ వరుకు చదువుతున్న 76,780 మంది విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఈనెల 17 వరకు 41,890 మందికి మాత్రమే అపార్ జనరేట్ చేశారు. దీంతో 50 శాతం లోపే లక్ష్యాన్ని సాధించారు. పాఠశాల స్థాయి వరకు ప్రక్రియ ముందుకు సాగుతున్నా ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల వివరాలు 20 శాతం కూడా నమోదు కాలేదు.


ఆధార్ కేంద్రంలో సవరణలు చేయించుకోవడానికి వేచి ఉన్న ఇంటర్ విద్యార్థులు


ఉరవకొండ తహసీల్దార్ కార్యాలయంలో అపార్ అర్జీలతో అధికారుల కోసం వేచి ఉన్న ప్రజలు

ప్రక్రియ వేగవంతం చేయిస్తాం



అపార్ ప్రక్రియ డివిజన్ పరిధిలో వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకొని వంద శాతం లక్ష్యాన్ని సాధిస్తాం. సాంకేతిక సమస్యల కారణంగా ఆధార్‌లో తప్పుల సవరణకు అంతరాయం కలుగుతోంది. దీన్ని అధిగమించి కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ వేగవంతంగా పని పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్, ఆర్డీఓ, గుంతకల్లు

ఆవుల అపహరణతో రైతుల బెంబేలు

రాయదుర్గంటౌన్: పట్టణంతోపాటు రాయదుర్గం రూరల్, గుమ్మఘట్ట మండలాల్లోని పరిసర గ్రామాల్లో గత ఆదివారం నుంచి పాడి ఆవుల అపహరణతో రైతులు బెంబేలెత్తుతున్నారు. మండలంలోని రాతిబావివంకలో దాదాపు ఏడు ఆవులను ఎత్తుకెళ్లారు. కురుబ కిష్టప్పకు చెందిన మూడు ఆవులు, కురుబ అంజినప్పకు చెందిన రెండు ఆవులు, ఒక దూడ, హరిశ్చంద్రనాయక్‌కు చెందిన ఆవును ఎత్తుకెళ్లారు. పట్టణంలోని శనిశ్చరాలయం వద్ద నాగరాజుకు చెందిన ఒక ఆవు, మార్కెట్ యార్డు సమీపంలో చిన్నాకు చెందిన ఆవు ఆదివారం అపహరణకు గురైంది. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో ఆవు రూ.30 నుంచి రూ.40 వేల దాకా పలుకుతోంది. గుమ్మఘట్ట మండలం దేవరెడ్డిపల్లి గ్రామంలో ఒక ఎద్దు, మారెంపల్లి గ్రామంలో ఒక ఆవును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై అర్బన్ సీఐ జయనాయక్ మాట్లాడుతూ రాతిబావి వంకలో ఆవుల అపహరణపై ఫిర్యాదు వచ్చిందన్నారు. దొంగతనాల నియంత్రణపై ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామన్నారు.

సచివాలయ ఉద్యోగి అదృశ్యం


కురుబ నరేష్

శెట్టూరు: మండలంలోని కనుకూరు గ్రామ సచివాలయ ఉద్యోగి కురుబ నరేష్ కనిపించలేదని కుటుంబ సభ్యులు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కుందుర్పి మండలం తెనగల్లుకు చెందిన నరేష్ .. సొంతూరు నుంచే విధులకు వెళ్లేవాడు. బుధవారం విధులకు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ఆఫ్‌లో ఉంది. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికారు. ఆచూకీలేకపోవడంతో నరేష్ భార్య సుమలత, కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు. ఆచూకీ లభిస్తే 9346917104, 9440796818 సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.